హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

- ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 13, 18 వార్డుల్లో ఉత్సాహంగా ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..


18వ వార్డులో పర్యటిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు


జీవీఎంసీ 13వ వార్డులో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఆరిలోవ: ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కొనియాడారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 13వ వార్డు ఏడో నంబరు సచివాలయం పరిధి ఎస్‌కేఎంఎల్ నగర్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎంపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ అవసరమని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను సీఎం వైఎస్ జగన్ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించారన్నారు. అందుకే అన్ని హామీలను నెరవేర్చారన్నారు. అందుకే 2024లో ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమలో అటవీ శాఖ అభివృద్ధి విభాగం డైరెక్టర్ వనము వరలక్ష్మి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు వానపల్లి ఈశ్వరరావు, స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, గూడపు విక్టర్, సుబ్బారావు, సచివాలయం కన్వీనర్లు అప్పలనాయుడు పాల్గొన్నారు.

18వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రచార కార్యక్రమం చేపట్టారు. వార్డులో గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కోట్ల రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి ఆర్థిక ప్రగతికి, నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం చదువుల ద్వారా పేదింటి పిల్లల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాటలు వేశారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి ప్రజారంజకమైన ముఖ్యమంత్రి జగన్ పరిపాలనను మరోసారి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, ముఖ్య నాయకులు పుక్కళ్ల శంకర్, ఉమ్మిడి దాసు, ముప్పల సురేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి


ఎంవీపీ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులకు వీటిని చేరువ చేసేలా కృషి చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించినట్టు చెప్పారు. ఇటీవల ఏయూను సందర్శించిన నాక్ బృందం సైతం గ్రంథాలయాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు.

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖ గ్రంథాలయంలో స్థానిక జేకే స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జయశంకర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. చాచా నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త సుసర్ల సర్వేశ్వరశాస్త్రి మాట్లాడుతూ బాలలు పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలన్నారు. దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రతో కూడిన పుస్తకాలతో పాటు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. స్థానిక పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. ఎంవీపీ కాలనీ శాఖా గ్రంథాలయం సేవలను వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు కోరారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ఎంవీపీ కాలనీ: డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం వాల్తేర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారం జరగనున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వాల్తేర్ డిపో మేనేజర్ సుధాకర్ పాల్గొని 60సీ, 52డీ, 68కే, 68డీ, 999, 900కే, 500 బస్ సర్వీసులకు సంబంధించి పలు సమస్యలు, సలహాలు, సూచనలపై వివరణలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. 99592 25590 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానం ప్రారంభం

ఆరిలోవ: కార్తీక మాసం పురస్కరించుకుని బాలభాను అర్చక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. నెల రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమం తొలి రోజు జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో షిర్డీ సాయిబాబ ఆలయం వద్ద శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కామేశ్వరశర్మ మాట్లాడుతూ నగరంలో ప్రతి రోజూ పలు ఆలయాల వద్ద భోజనం ప్యాకెట్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పంతుల వెంకటరమణ, మావుడూరు కిశోర్‌కుమార్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి విద్యార్థులు విస్తృత సేవలు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు మంగళవారం నగర వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, దివ్యాంగ విద్యార్థుల పాఠశాలలకు వితరణలు చేపట్టారు. ఇందులో భాగంగా మధురవాడలోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధులు, చిన్నారులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

రోగులకు పండ్ల పంపిణీ


భోజనం పరిశీలిస్తున్న కార్పొరేటర్లు

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలోని రోగులకు 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి పండ్లు పంపిణీ చేశారు. మంగళవారం ఆస్పత్రికి వెళ్లి స్వయంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు అందిస్తున్న భోజన నాణ్యత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముప్పల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పడిపూజకు ఏర్పాట్లు

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో పడి మెట్లను పూజకు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 16న ఈ పూజ ప్రారంభం కానుంది. శబరిమలలో ప్రారంభించిన రోజు అదే సమయానికి ఇక్కడ మెట్ల పూజలు ప్రారంభించనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ తెలిపారు.

పర్యావరణ, వాతావరణ మార్పులపై శిక్షణ


సదస్సులో ప్రసంగిస్తున్న ఆచార్య వీరభద్రం

ఏయూ క్యాంపస్: అమెరికా కాన్సులేట్ జనరల్, హైదరాబాద్, ఒడిశాకు చెందిన వ్యాస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఏయూలోని అమెరికన్ కార్నర్‌లో తెలుగు మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టుల కోసం 6వ పర్యావరణ, వాతావరణ మార్పులపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించాయి. వ్యాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు, పర్యావరణ వేత్త జె.వి.రత్నం, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సీనియర్ జర్నలిస్ట్ జనార్దన్‌రావుతో కలిసి ప్రాంతీయ వర్క్‌షాప్ ప్రారంభించారు. జె.వి.రత్నం వాతావరణ మార్పులు దుష్ప్రభావాలను వివరించారు. ఏయూ పర్యావరణ శాస్త్రాల విభాగం అడ్జెంక్ట్ ప్రొఫెసర్ కె.వీరభద్రం మారుతున్న వాతావరణం–ప్రజల్లో అవగాహన కల్పించడం అనే అంశంపై మాట్లాడారు. జీవీఎంసీ ప్రొగ్రాం డైరెక్టర్ శ్రీ శ్రీనివాస రాజమణి వాతావరణ మార్పులు– విపత్తు నిర్వహణ అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రముఖ మీడియా సంస్థల నుంచి మొత్తం 30 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో కేక్ మిక్సింగ్ వేడుక


ఎఫ్‌సీఐలో కేక్ తయారీలో కలిపిన వివిధ రకాల డ్రై ఫ్రూట్స్


పండ్లు మిక్సింగ్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు, విద్యార్థులు

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో మంగళవారం కేక్ మిక్సింగ్ వేడుక ఉత్సాహంగా జరిగింది. క్రిస్మస్ కోసం ఫ్రూట్ కేకు తయారీకి 14 రకాల డ్రై ఫ్రూట్స్, నాలుగు రకాల వైన్ కలిపారు. అన్ని రకాల పండ్లు ఓ టేబుల్‌పై పేర్చి ఎఫ్‌సీఐ అక్షర మాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. వీటిలో విస్కీ, బ్రాంది, రమ్, వైన్ వేసి పండ్లు అన్నింటిని ముద్దగా చేశారు. దానిలో పంచదార, గుడ్లుతో పాటు అవసరమైన పిండి కలిపి సుమారు 100 కిలోల కేకు తయారు చేయనున్నారు. ఈ మిక్సింగ్‌లో మూడు రకాల టూట్రీ ఫ్రూట్స్, రెండు రకాల చెర్రీ పండ్లు, మూడు రకాల ఎండు ద్రాక్ష, రెండు రకాల ఖర్జూరం, బ్లాక్ కరెంట్, బాదం, జీడి, పిస్తా, దోస, గుమ్మడి, అంజీర్, ఆరెంజ్ తొక్క(పీల్), అల్లం చిప్స్ ఉపయోగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ ఈ పండ్లను నెల రోజుల పాటు నానబెట్టనున్నట్లు తెలిపారు. క్రిస్మస్‌కు ఈ కేకు తయారవుతుందన్నారు. కిలో రూ.750 చొప్పున విక్రయిస్తామని చెప్పారు. క్రిస్మస్‌కు రెండు రోజుల ముందు నుంచి ఈ కేకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు రవి, పార్థసారథి, కుముదుని, పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

అత్యుత్తమ నాక్ ర్యాంకు సాధనపై హర్షం


దూరవిద్య కేంద్రంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించడంపై దూరవిద్య కేంద్రంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులను అభినందించారు. అందరూ సమష్టిగా పనిచేస్తూ అత్యుత్తమ గ్రేడ్ సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీసీని అభినందించిన పాత్రికేయులు


వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న జర్నలిస్టులు

ఏయూ క్యాంపస్: నాక్ ర్యాంకింగ్‌లో ఏయూ అత్యుత్తమ గ్రేడ్ సాధించడంపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా యూనిట్లు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం ఉదయం వీసీ ప్రసాదరెడ్డిని ఘనంగా సన్మానించాయి. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూమోనియాపై అవగాహన అవసరం


పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, పలువురు వైద్యులు

మహారాణిపేట: పిల్లల్లో వచ్చే న్యూమోనియా లక్షణాలపై అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో న్యూమోనియా లక్షణాలపై పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కువ సార్లు శ్వాస తీసుకోవడం, నీరు తాగలేకపోవడం, ఆహారం తినలేకపోవడం, శ్వాస తీసుకొనే సమయంలో గురక రావడం, నీరసంగా, మత్తుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే పిల్లలను వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమాదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డీమో) బి.నాగేశ్వరరావు, పలు ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీష్‌ప్రసాద్, మనోరమ, బి.నాగభూషణం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

బీచ్‌రోడ్డు: రాధాకృష్ణ మహోత్సవంలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న యాదవ యువతను ప్రోత్సహించేందుకు ఈ నెల 18 నుంచి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్టు విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం శివాజీపాలెంలోని ఓ సమావేశ మందిరంలో స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ మీట్‌లో క్రికెట్, కబడ్డీ, షటిల్ నిర్వహిస్తామన్నారు. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనదలిచిన వారు ఈ నెల 16వ తేదీలోపు 81434 46565, 99853 38722 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు చైర్మన్‌గా ముప్పల సురేష్, కో చైర్మన్‌గా పీతల గోవింద్‌ను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ మొల్లి అప్పారావు, యువత అధ్యక్షుడు పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయ సాధనకు కృషి

- బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ
- ఘనంగా బాలల దినోత్సవం


బాలుర గృహంలో నెహ్రూ చిత్ర పటం వద్ద జ్యోతి వెలుగిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంకటశేషమ్మ


ఏయూ సెనెట్ మందిరంలో చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు బహూకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి


హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఎస్.ఖాన్


బాలికల గృహంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

ఆరిలోవ: మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం బాలల దినోత్సవాన్ని తూర్పు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతం రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో జరిగిన బాలల దినోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, అతిథులుగా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పాల్గొని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసలి అప్పారావు మాట్లాడుతూ నెహ్రూ బాల బాలికలను ఎంతగానో ప్రేమించేవారన్నారు. చాచా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ముడస ర్లోవ సమీప దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర వసతి గృహం, బాలుర ప్రత్యేక గృహం, బాలుర పరిశీలన గృహాల్లో నిర్వహించిన వేడుకల్లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని నెహ్రూ చిత్ర పటం వద్ద జ్యోతి వెలిగించి అంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ బాలలు క్రమశిక్షణతో నడుచుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. నెహ్రూ ఆశయ సాధనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పని లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నైపుణ్యం, ఆసక్తి, కష్టపడే తత్వం ఉన్న వారు ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. ఆయా కార్యక్రమాలలో ప్రభుత్వ బాలల వసతి గృహాల సూపరింటెండెంట్లు ఎన్.సునీత, రమణ, పి.అన్నాజీ, వీరయ్య, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎం.రామలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలకు వితరణ

ఏయూ క్యాంపస్: బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలకు గురుస్థానం పాఠశాల డైరెక్టర్ ఎస్.ఖాన్ నిత్యావసర సరకులు అందజేశారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. మానసిక వికలాంగ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో వర్సిటీ తెలుగు మాధ్యమం పాఠశాలల విద్యార్థులకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి పుస్తకాలు, పెన్నులు బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఉన్నత ఆశయాలు నిర్దేశించుకుని ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు మత్స్యకార పాఠశాలలో బాలల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత క్లబ్ అధ్యక్షుడు పేర్ల భాస్కరరావు, పాఠశాల హెచ్ఎం కేవీ సత్యవేణి తదితరులు.. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: బాలల దినోత్సవం సందర్భంగా రామ్‌నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులను సత్కరించి, బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శనతో ఆహూతులను అలరించారు.


19వ వార్డు మత్స్యకార పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు


రామ్‌నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కారం పొందిన చిన్నారులు

బీచ్ రోడ్డులో 19న ఛట్ పూజ


ఛట్ పూజ పండగ వివరాలు తెలుపుతున్న సమితి ప్రతినిధులు

మద్దిలపాలెం : బిహార్, ఉత్తరప్రదేశ్‌లో ఘనంగా జరుపుకొనే ఛట్ పూజ మహోత్సవాన్ని ఈ నెల 19న విశాఖ ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్నామని విశాఖ ఛట్ పూజా సమితి ప్రతినిధులు సుభాష్‌చంద్ర, రాయ్, ప్రకాష్ తెలిపారు. ఉదయించే సూరుడుతో పాటు, అస్తమించే సూరుడిని సంప్రదాయబద్ధంగా పూజించిడం దీన్ని విశిష్టత అన్నారు. ఈ వేడుకలకు సుమారు 5 వేల మంది హాజరు కానున్నారని వారు పేర్కొన్నారు.

అన్ని అవయవాలపై మధుమేహం ప్రభావం


షుగర్ వ్యాధి గురించి వివరిస్తున్న ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ మురళీమోహన్

మహారాణిపేట : మధుమేహం అన్ని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ అన్నారు. మంగళవారం జాలారిపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తరచూ మూత్ర విసర్జన, అధిక దాహం, విపరీతమైన ఆకలి, బలహీనత, అలసట, నొప్పులు, మసకబారిన చూపు, దురదలు వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎక్కువగా ఫైబర్ ఆహారం తీసుకోవడం, ఆహార నియమాలు పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి వాటి ద్వారా కొంత వరకు మధుమేహాన్ని నివారించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఆలిండియా కుస్తీ పోటీలకు 'సమత' విద్యార్థిని

ఎంవీపీ కాలనీ: ఆలిండియా కుస్తీ పోటీలకు సమత కళాశాల విద్యార్థిని జి.కవిత ఎంపికై నట్టు ఎంవీపీలోని కళాశాల యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటర్ యూనివర్సిటీ కుస్తీ పోటీల్లో కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న కవిత బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. తద్వారా 55 కేజీల విభాగంలో ఆలిండియా పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో ఛత్తీష్‌గఢ్‌లోని మొహాలీ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయన్నారు.

కార్తీకం.. శుభకరం


జ్ఞానలింగేశ్వర స్వామికి అభిషేకాలు

మద్దిలపాలెం : కార్తీక మాసోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పీతలవానిపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. సాయంత్రం ఆకాశ దీపం విడిచిపెట్టారు. అనంతరం అఖండ జ్యోతిని అర్చకుడు మురళీశర్మ ఏర్పాటు చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశ్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మ ఆకాశదీపం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులతో అఖండ జ్యోతిని వెలిగించారు. ఇసుకతోట, హెచ్‌బీ కాలనీల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.